క్లుప్తంగా

మెకానిక్‌పై దాడికి ఖండన

కందుకూరు: తాగి బైక్ నడుపుతున్నాడనే కారణంతో పోలీసులు పట్టణంలోని ఓ బైక్ మెకానిక్‌ని తీవ్రంగా కొట్టి గాయపర్చడాన్ని కందుకూరు పట్టణ మోటార్ మెకానిక్ అసోసియేషన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పోలీసులు ఒక బైక్ మెకానిక్‌పై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చడం బాధాకరమన్నారు. మెకానిక్‌ను తీవ్రంగా కొట్టిన పోలీసులపై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కనిగిరి రూరల్: వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రియార్షనంద అన్నారు. పట్టణంలోని దేవాంగ నగర్‌లో శనివారం వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియార్షనంద మాట్లాడుతూ వాతావరణం మార్పులతో డెంగీ, మలేరియా, అతిసారా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వర్షకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే ఆస్పత్రులకు రావాలన్నారు. సూపర్‌వైజర్ ఉమామహేశ్వరరావు, మలేరియా అధికారి రామాంజనేయులు, సచివాలయం హెల్త్ సెక్రటరీ లక్ష్మీ, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

జరుగుమల్లి (సింగరాయకొండ): చింతలపాలెంలో పాలేరు నుంచి ఈనెల 29వ తేదీ అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను ఎస్సై పున్నారావు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఈ ట్రాక్టర్లకు శనివారం ఒక్కో దానికి 10 వేల రూపాయల చొప్పున జరిమానా వసూలు చేసినట్లు వివరించారు.


కనిగిరిలో ముసురుతో జనజీవనం ఇలా..


హనుమంతునిపాడులో రోడ్లపై నిలిచిన వర్షం నీరు


పొన్నలూరు పొలాల్లో నిలిచిన వర్షపు నీరు


సింగరాయకొండ: మార్కెట్ సెంటర్‌లో సేఫ్టీ కోన్స్ ఏర్పాటు

ఎడతెరిపి లేకుండా..!

- రోజంతా ముసురు
- అస్తవ్యస్తంగా జనజీవనం
- పట్టణంలో రోడ్ల పైకి మురికి నీరు
- సింగరాయకొండలో 19.8 మిల్లీమీటర్ల వర్షపాతం
- పలు మండలాల్లో జల్లులు
- వర్షాలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు

కనిగిరి రూరల్:

రోజంతా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో కనిగిరి తడిసి ముద్దయింది. శుక్రవారం రాత్రి చిరుజల్లుల వర్షం కురిసినా.. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేని చిరుజల్లులలో వర్షం పడింది. దీంతో వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇక్కట్లు పడ్డారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వర్షాలు పడ్డాయి. పట్టణ శివారు ప్రాంతాల్లోని వీధులన్నీ చిత్తడి మయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లోని కుంటల్లో, రోడ్లు బురదమయంగా చిత్తడి మయంగా మారాయి. డ్రైనేజీలు పొంగడంతో కొన్ని చోట్ల మురికి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. కచ్చా డ్రైన్లు కూడా లేని కనిగిరి పట్టణ శివారు ప్రాంతాలైన శంఖవరం, చింతలపాలెం, ఎస్సీ కాలనీ, మాచవరం, కాశీపురం, దేవాంగనగర్, టకారి పాలెం, కాశిరెడ్డి కాలనీల్లో వర్షం చిత్తడికి నడక నరకయాతనగా మారింది. కనిగిరి పట్టణంలో ఇటీవల డ్రైనేజీ కాలువను శుభ్రం చేసిన అధికారులను వ్యర్థాలను రోడ్డు పక్కన పడేశారు. వాటిని తొలగించకుండా అలాగే ఉంచడంతో మురుగు దిబ్బలన్నీ రోడ్ల మీదకు జాలు వారడంతో రోడ్లంతా నల్లగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

హనుమంతునిపాడు: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. శనివారం ఉదయం 7 గంటల వరకు 27 మి.మీ వర్షపాతం నమోదు కాగా, శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 20 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలం మొత్తం వర్షాలు కురిశాయి. ఈ వర్షం పొగనాట్లు, వరినాట్లు, పండ్ల తోటల సాగు, కంది, ఇతర పంటల సాగుకు ఎంతో అనుకూలిస్తుందని రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాగులు, కుంటలు, వంకలోకి నీరు చేరింది. వర్షంతో కంభం కనిగిరి రోడ్డు గుంతలమయమైంది. మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయి. వర్షంతో రోడ్డు గుంటలో వర్షం నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ పొలాల్లో నీరు నిలిచింది. బోరుబావుల కింద వరి సాగు చేసే రైతులకు మాగాణి భూమి తమ్ముకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

వెలిగండ్ల: మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి ఓ మోస్తారు వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో రోడ్లు చిత్తడిగా మారాయి. శనివారం సాయంత్రం నుంచి చల్లటి గాలులు వీస్తున్నాయి. ఇప్పటి వరకు వర్షం కారణంగా ఎలాంటి నష్టం జరగలేదు.

వర్షం.. హర్షం

సింగరాయకొండ: తుఫాను ప్రభావంతో మండలంలో శనివారం 19.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెల్లవారుజాము నుంచి తేలికపాటి జల్లులు కురవటంతో ప్రధాన రహదారిలోని రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలబడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఎస్సై మహేంద్ర వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక కోన్స్ ఏర్పాటు చేశారు. బాలయోగినగర్ జంక్షన్ వద్ద గుంతల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో విద్యార్థులకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు. ఎస్ఏ-1 పరీక్షను సెప్టెంబరు ఆరో తేదీకి వాయిదా వేశారు. సముద్రంపై పడమర గాలులు వీస్తుండటంతో అలల ఉధృతి లేదని మత్స్యకారులు తెలియజేస్తున్నారు.

పొన్నలూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పొన్నలూరు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఓమోస్తారు వర్షం కురిసింది. దీంతో ఆయా పంట పొలాలు, వాగుల్లోకి వర్షపు నీరు చేరాయి. పొన్నలూరు, ముత్తరాసుపాలెం, వెల్లటూరు, ముప్పాళ్ల, చెరుకూరు, కె.అగ్రహారం గ్రామాల్లో ఓమోస్తారు వర్షం పడింది. మండలంలో 3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మర్రిపూడి: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని కూచిపూడి, మర్రిపూడి, అంకేపల్లి, చెంచిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో 6 విద్యుత్ స్తంభాలు నేలకు వరిగినట్లు మండల విద్యుత్ శాఖాధికారి రామకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తడిచేతులతో స్టాటర్‌లు, మోటారు పెట్టెలు విద్యుత్ స్తంభాలు, వైర్లు తగులుతున్న చెట్లు ముట్టుకోరాదన్నారు. అలాగే ఇంట్లో తడిచిన స్విచ్ బోర్డులు, బయటపెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలు కరెంటు వస్తువుల వద్దకు రానివ్వకుండా చూసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులు వచ్చిన సమయంలో టీవీలు, ఫ్రిజ్‌లు, డిష్ కనెక్షన్లు ఆపి వేయాలని హెచ్చరించారు. ఇంట్లో సర్వీస్ వైర్లు డ్యామేజీ ఉంటే విద్యుత్‌శాఖ ఏఎల్ఎం, లైన్‌మెన్, జేఎల్ఎంకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

టంగుటూరులో మోస్తారు వర్షం

టంగుటూరు: తీవ్ర అల్పపీడనం కారణంగా శనివారం మోస్తారు వర్షం కురవటంతో రహదారులు జలమయ్యాయి. అలాగే పోతల చెంచయ్య కాలనీ ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల పైకి వర్షపు నీళ్లు చేరాయి. మండలంలో 21.4 మి. మీ వర్షపాతం వర్షపాతం నమోదైంది. నూము పంటలు దెబ్బతినకుండా, వర్షపు నీరు పంట తోటల్లో నిల్వ ఉండకుండా ఏఓ స్వర్ణలత సూచనలు చేశారు. తహసీల్దార్ ఆంజనేయులు లోతట్టు ప్రాంతమైన పార పుల్లారెడ్డిపాలెంలోని 25 మంది ఎస్టీలను పరిశీలించారు. వారిని ఆలకూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తరలించి భోజనం, తదితర సదుపాయాలు కల్పించారు.


కూచిపూడిలో నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభం


సింగరాయకొండ: బాల యోగినగర్ సెంటర్‌లో రోడ్లపై నీరు


మధ్యాహ్నం తర్వాత బయటకు వస్తున్న బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు


టంగుటూరులో భారీ వర్షం


టంగుటూరు: వర్షపు నీటిలో జలమయం అయిన కొండపి ఫ్లైఓవర్

బదిలీ అయినా.. రిలీవ్ కాకుండా..

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపల్ కమిషనర్ బదిలీ అయి...మూడు రోజులైనా ఇంకా రిలీవ్ కాకపోవడంపై పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఆయన్ను కనిగిరి నుంచి బదిలీ చేసి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని గత నెల 29న ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే బదిలీ అయి మూడు రోజులైనా ఆయన ఇంకా రిలీవ్ కాకుండా కొన్ని లెక్కలు సరిదిద్దుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. కార్యాలయంలోని రెగ్యులర్ ఏఈని పక్కన బెట్టి వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా ఓ సచివాలయ ఎమ్యునిటీ కార్యదర్శికి అనధికారి ఏఈ అర్హత కల్పించి అనేక వర్కుల బిల్లులు చేసినట్లు తెలిసింది. వాస్తవానికి ఎమ్యునిటీ కార్యదర్శి ఏఈ హోదాలో పర్యవేక్షణలు చేయకూడదు. కొన్ని వర్కులకు సంబంధించిన బిల్లులకు ఇంకా కొన్ని ఎంబుక్ రికార్డులు.. నామినేషన్ తీర్మాణాలు చేయాల్సి ఉంది. కొన్ని పనులకు అగ్రిమెంట్ చేయకుండా పనులు చేయించినట్లు తెలిసింది. దీంతో ఆ పనుల లెక్కలను సరిదిద్దుకునేందుకు రిలీవ్ కాకుండా మూడు రోజులుగా ఆ పనుల్లో నిమగ్నమైనట్లు సమాచారం. ఈ పనులు తమతో ఎక్కడ చేయిస్తారన్న భయంతో కార్యాలయంలోని కీలకమైన అధికారులంతా సెలవుపై వెళ్లారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

కొండపి (సింగరాయకొండ): కొండపి మండల అభివృద్ధి కేంద్రంలో ఎంపీపీ స్వప్నకుమారి, ఎంపీడీవో రమణమూర్తి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొనడానికి ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపించలేదు. కోరం కోసం చాలా సేపు వేచి ఉండగా, ఎప్పటికో కోరం ఏర్పడింది.

పచ్చిరొట్ట విత్తనాలు కలియదున్నాలి

టంగుటూరు: పొగాకు రైతులు పచ్చిరొట్ట విత్తనాలు కలియ దున్నితే భూములు సారవంతం అయ్యి అధిక దిగుబడులు పొందవచ్చునని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సలహాలు, సూచనలు చేశారు. పొగాకు గరిష్ట ధర రూ. 358 పలకగా, కనిష్ట ధర రూ. 195 పలికిందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అన్నారు. స్థానిక 4వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ కృపావరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా కేంద్రాల నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. పిల్లలకు, తల్లులకు, గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారం సమయపాలన పాటించాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లల బరువులు నమోదుచేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా పోషణ్ మాహ్ కార్యక్రమం గురించి వివరించి కార్యకర్తలతో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. అనంతరం రికార్డుల నిర్వహణపై, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యకర్తలకు వివరించి అనంతం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సరళారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీ రామరాజుకు సన్మానం


డీఎస్పీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనిగిరి రూరల్: డీఎస్పీ రత్నాకరం రామరాజు ఉద్యోగ విరమణ సన్మానోత్సవ సభ శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక పవిత్ర కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి, అందరి మన్ననలను పొందిన అధికారి అని కొనియాడారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కనిగిరి జడ్జి కె.భరత్ చంద్ర, ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్, సీఐలు ఎస్‌కే ఖాజావలి, భీమానాయక్, శివరామకృష్ణారెడ్డి, ఎస్సై త్యాగరాజు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొని సన్మానించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


వగ్గంపల్లెలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

పామూరు: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి రాధ అన్నారు. మండలంలోని వగ్గంపల్లెలో వరినారు మళ్లు, జనుము పంటలను శనివారం ఏఓ రాధ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు కురిసిన వర్షంతో పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, బెట్టదశలో ఉన్న పైర్లకు వర్షం వల్ల మేలు చేకూరిందన్నారు. రానున్న రెండు రోజుల్లో వర్షాలు అధికమైతే రైతులు పంటలకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పొంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఆమె వెంట వీఏఏ అభిషేక్, రైతులు ఉన్నారు.

వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

కనిగిరి రూరల్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ వర్ధంతి రోజున నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో, అన్ని గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. వైఎస్సార్ చేసిన సేవలను, స్మరించుకుంటూ పార్టీ నేతలు, శ్రేణులు సేవాహిత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పక హాజరుకావాలని పిలుపునిచ్చారు.

మాలకొండ ఆదాయం రూ.9,75,538

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.9,75,538 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.24,800, తలనీలాలు రూ.49,500, ప్రత్యేక దర్శనం రూ.2,92,600, లడ్డుప్రసాదాలు రూ.2,12,580 అన్నదానం రూ.3,00,092, రూమ్ అద్దెలు రూ.33,040 వచ్చినట్లు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండండి


పాకలలో సూచనలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కుమార్

సింగరాయకొండ: తుఫాను పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ ఏ. కుమార్ అన్నారు. తుఫాన్ ప్రభావిత గ్రామాలైన పాకల, ఊళ్లపాలెంలో శనివారం ఆయన పర్యటించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. తహసీల్దార్ టి. రవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ మూర్తి, ఆర్ఐ ప్రవీణ్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన బేళ్లకే అధిక ధర

కొండపి (సింగరాయకొండ): నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం రైతులకు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎక్కువ ధరకు పొలాలను కౌలుకు తీసుకొని నష్టపోవద్దని, వచ్చే సీజన్‌లో కూడా పొగాకు ఇంత ధర ఉంటుందని చెప్పలేమన్నారు. బోర్డు సూచించిన మొత్తంలో పొగాకు పండించి రైతులు లాభాలు పొందాలని తెలిపారు. అనంతరం నిర్వహించిన వేలం లో ఎస్.ఎస్ కండ్రిక, పెట్లూరు, జగ్గరాజుపాలెం, వర్ధినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1025 బేళ్లను వేలానికి తీసుకొని వచ్చారు. 795 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 230 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 358, కనిష్ట ధర రూ. 190, సరాసరి ధర 286.74 పలికింది.

పింఛన్ల పంపిణీ

హనుమంతునిపాడు: స్థానిక మిట్టపాలెంలో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. మొదటి రోజు 91.85 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కె.లలిత తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ షేక్ షరీఫ్, టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపరచాలి

పామూరు: ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కడంతో పాటు, సంక్షోభాన్ని కప్పిపుచ్చుకునేందుకు అగ్రదేశాలైన అమెరికాలాంటి దేశాలు యుద్ధాలను ఉసిగొల్పుతున్నాయని సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ జాలా అంజయ్య అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం సీపీఎం సీఎస్‌పురం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాలా అంజయ్య మాట్లాడారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న అమెరికా యుద్ధాలను ప్రోత్సహించి ఆ దేశాలకు ఆయుధాలను అమ్మి సొమ్ము చేసుకొని ఆర్థిక లబ్ధి పొందుతోందన్నారు. సంక్షోభాలకు పరిష్కారం సోషలిజమేనని చైనా, వామపక్ష పాలిత దేశాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని కమ్యూనిస్టులు ఇతర ప్రాంతాల్లో అభివృద్ధికోసం ఆదిశగా పోరాటాలు, ప్రయత్నాలు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు నానాటికి ప్రబలుతున్నాయని ప్రజలను సీజనల్ వ్యాధుల బారి నుండి కాపాడేందుకు తగిన వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ములపాటి మాల్యాద్రి, రఘురాం, రాజ్యలక్ష్మి, భానుమతి, మదారమ్మ, కె.శంకర్, అల్లాభక్షు, సీహెచ్.వెంకటేశ్వర్లు, వైవీ నారాయణ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితం వ్యర్థం

సింగరాయకొండ: యువత ఈవ్‌టీజింగ్, గంజాయి వంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్సై బి. మహేంద్ర విద్యార్థులకు సూచించారు. స్థానిక పీఎస్‌సీపీ జూనియర్ కాలేజీలో శనివారం జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మాట్లాడారు. తాను పేదరికంలో పుట్టి కష్టపడి చదివి ఈ స్థాయికి ఎదిగానన్నారు. కాలేజీ యాజమాన్యం ఆయనను సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాలేజీ కరస్పాండెంట్ పి. గీతారాణి, చైర్మన్ పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణదారులపై చర్యలు


భూములను పరిశీలిస్తున్న అధికారులు

పామూరు: దేవస్థాన భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ బొంతు మహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కె.జనార్ధన్‌రెడ్డి అన్నారు. పామూరులో ఆక్రమణలకు గురైన మదనవేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన స్థలాలు, వాటిలో నిర్మించిన దుకాణాలు, కందుకూరురోడ్డు, నెల్లూరురోడ్డు, విరువూరురోడ్డు, నెల్లూరుజిల్లా వేంపాడు సమీపంలోని ఆలయ భూములను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆక్రమణలకు గురైన ఆలయ భూములు, దుకాణాలు నిర్మించిన స్థలాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని షాపుల అద్దెకు బహిరంగ వేలం నిర్వహించాలని ఈఓ నరసింహబాబును ఆదేశించారు. జాతీయ రహదారి, రైల్వేలైన్ నిర్మాణం ద్వారా భూమి కోల్పోయిన ఆలయాలకు వచ్చే నష్టపరిహారం రూ.2 కోట్లు దేవాలయ ఖాతాలో జమయ్యే విధంగా, దేవాలయాల భూములన్నీ కూడా ఆన్‌లైన్‌లో దేవునిపేరుపై ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ రమణారావును కోరారు. దేవాలయ భూములు అమ్మినా, కొనుగోలు చేసినా చెల్లవని ప్రజలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. ఆయన వెంట దేవదాయశాఖ సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, పసుపులేటి రఘురాం, పలువురు పాల్గొన్నారు.

జరుగుమల్లి తహసీల్దార్‌గా జనార్దన్

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండల తహసీల్దార్‌గా బి. జనార్దన్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. కందుకూరు రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రమోషన్ కారణంగా బదిలీపై వచ్చారు. డీటీ అరుణ, ఆర్ఐ రమణయ్య, ఏఎస్ఓ సుబ్రహ్మణ్యం, నవీన్, కౌసల్య పాల్గొన్నారు.

ప్రతి పాఠశాల ఒక ఉద్యానవనం కావాలి

సీఎస్‌పురం(పామూరు): ప్రతి ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా ఉద్యాన వనాలుగా రూపుదిద్దాలని డాక్టర్ సందిరెడ్డి మురళి, పాఠశాల హెచ్ఎం భారతి అన్నారు. మండలంలోని ఆనికాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. భావితరాల బంగారు భవిత కోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.